## [illegible]

"చక్కెర స్టాకయి పోయింది సార్..."
..."అప్పుడేనా?"
"అవునుసార్, కానీ..."
"కానీ "
"మీ కోసం ఉంచాలెండీ, మామూలు ధరకంటే ఒక్క రూపాయెక్కువ"
"అంటే బ్లాకా?"
(సీను మారితే...)

"నువ్వేనా బాబూ, రమేషం"
"అవునుసార్"
"నీ సర్టిఫికేట్లన్నీ చూశాం...కానీ, ఈ ఉద్యోగం ఇంతకు ముందే ఫిలప్ అయిపోయింది."
"సార్!"
"బట్ డోంట్ వర్రీ, ఓ ఐదు వేలిస్తే, ఈ ఉద్యోగం నీదే"
"అంటే లంచమా?"

### బాబోయ్...బాబోయ్...


(సీను మారితే...)

"సార్! నా రోగం..."
"నయం చేస్తా, నయం చేస్తా, కానీ..."
"ఏమిటా? కానీ..."
"ఇది ప్రభుత్వాసుపత్రి, ట్రీట్‌మెంట్ బాగుండదు!"
"ఇంతకీ మీరు చెప్పేదేమిటి?"
"అబ్బే ఏముంది?... నా ప్రైవేట్ క్లినిక్ వుంది చూశావూ?"
"ప్వలాభాలా?"
( ఇలా సీనులు మారుతూ ఉంటే...)

అది నాయనా! సంగతి
కాబట్టి...
ఇందు గలదందులేదన్న సందేహము వలదు. అన్యాయమెందెందు వెతికిన అందందే కలదు.
బతుకోసమరం నాయనా, నీవో సైనికుడివి.
కాబట్టి...

— కందమూరి జనార్దన్

# అసలు రహస్యం



పట్టణ మహిళా సంఘ సమావేశానంతర బాతాఖానీ ప్రారంభమైంది.

అన్నపూర్ణమ్మగారొచ్చి "ఏమిటోయ్ ఉత్పలా! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అంది.

"అటు చూడండి, మన పని మనిషి పార్వతి! దాని వెనకాలే దాని మొగుడు! ఏదేం మంత్రం వేసిందో గాని, ఎప్పుడూ అలా దాని వెనకాలే తిరుగుతూ ఉంటాడు. నేనూ ఉన్నాను, నెలకోసారి కనిపించే మొగుడ్తో కాపరం చేస్తూ" అంది ఉత్పల.

"పదేలే! రోలెళ్ళి మద్దెలతో చెప్పిందిట. ఆవిడతోనే చెప్పావ్! పాపం బాబాయిగారు పిన్నిగారి మొఖం చూసి ఎన్నాళ్ళయిందో. ఎంతసేపూ అటాఫీసూ, ఇటు క్లబ్బూ"—జలజ ఝూడింపు.

"అబ్బో పెద్ద! నీ సంగతేమిటోయ్! ఫుల్ బాటిల్ వాటేస్కుని డబుల్ కాట్ కంటిల్లాయేగా మీవారు?"—అనుపమ అంటింపు.

"సరిసరి! నీ సంగతే చెప్పావ్! పాపం మీ డైరెక్టర్ గార్కి యింటిమీద ఎంత మోజో! ఎప్పుడూ ఔట్ డోర్లే!"—గిరిజ గూటింపు.

"చాల్లెండోయ్ మీ గోల! అర్థం లేకుండాను. అందరం ఒకే రైల్లో ప్రయాణం చేస్తున్నాంగానీ, ఉత్పల చెప్పినట్టు పార్వతికి తెలిసినపాటి ట్రిక్కు మనకి తెలియలేదు. ఎన్ని సంఘాలు పెడితేనేం, ఎన్ని ఉపన్యాసాలు దంచితేనేం, మొగుణ్ని కొంగుకి కట్టుకోవడం తెలీకపోయిన తరువాత"—వాణీదేవి వాత.

"కరెక్టోయ్ వాణీ! సమ్ ట్రిక్ యీజ్ దేర్ విత్ హర్! ఐ విష్ ఐనో యిట్"—గజలక్ష్మి జగాలోచన.

"ఓహోహో ఆ ఆలోచనల్లో ఉన్నావా గజలక్ష్మి తల్లీ! ఆ మోటు బండ ఏదో మకర బంధం చెపుతుంది. ఆ బంధం వేసి మీ ఆయన్ని నువు పట్టుకునే టప్పటికి ఈ భూమికీ, నీకూ బంధం తీరిపోతుంది"

విశ్వనాథ పావనిశాస్త్రి

కామాక్షి కామెంటరీ.

"అలా కాదోయ్ కామాక్షీ! ఇన్నాళ్ళ నుంచి చూస్తున్నాం కదా! అలా ఇరవైనాలుగ్గంటలూ దాని కొంగు విడవకుండా తిరుగుతున్నాడంటే వాడు దాని దగ్గర తప్పకుండా ఏదో రహస్యం ఉందోయ్! అదేమిటో లాగాలి అందరం కలిసి" అంది మీనాక్షి.

"ఇదిగో మీనా! తీరా దాని దగ్గరకి వెళ్ళి ఆ రహస్యం ఏమిటో కాస్త చెప్ప తల్లీ అని అడిగామా, అది కాస్తా సత్యభామ దగ్గర ద్రౌపది ఫోజు పెట్టి పాతివ్రత్య సూత్రాలు బోధించేయగలదు మనకి. జాగ్రత్త" రంగనాయకి రెడ్ సిగ్నల్.

ఏమైనా సరే అని చివరికి అంతా కలిసి పార్వతిని పిలిచి, ఆప్యాయంగ కాఫీ అందిచ్చి, "ఒసే పార్వతీ! నీ మొగుణ్ణి అలా నీ వెంట యిరవైనాలుగ్గంటలూ తిప్పకుంటావ్ గదా! నువ్వంటే వాడంత 'లవ్' తో పడిచావడానికిగల ఆ రహస్యం ఏమిటో మాకివ్వాళ చెప్పి తీరాలి. చెప్పక పోయావో నీ తల వెయ్యి తమలపాకులవుతుంది, కాదు కాదు వెయ్యి వక్కలవుతుంది. అంతేకాదు, సంఘంలో ఉద్యోగానికీ నీకూ రాం రాం. జాగ్రత్త" అంటూ దబాయింపుగా అడిగేశారు.

"వాలమ్మో! అదేటమ్మో! అలాగంటారు? ఇరవై నాలుగ్గంటలూ పెళ్ళాం ఎనకాతలే తిరిగే మొగుడి సంగతి మీకు తెల్సినట్టు లేదు తల్లీ! లవ్వూ కాదు, ఆడి పిండవూ కాదు. అనుమాన పిశాచం నంజికొడుక్కి. కాలు మదుసుకుంటా నా మగడా అంటే ఎనకాలే తయారవుతాడు. సచ్చే సావుగా వుంది యీడితో. ఆడాళ్ల సమాజం గదాని ఇక్కడే దూరంగా ఉంటాడు..."

ఆపైన మహిళా సంఘానికి కళ్ళేతప్ప చెవులు పన్జేయడం మానేశాయి●



## కాలాన్ని క్రాంతిలోకి

నిశిరాత్రుల నిచ్చెనెక్కి
చందమామ నందుకొంటా
కన్నీళ్లను మోసుకెళ్లి
కలల ఏరులో ముంచి తెస్తా!

శశినేత్రం కాంతి తాగి
భూమ్యాగ్ని చేరుకుంటా
పున్నమి కలం మోసుకొచ్చి
వెన్నెల సిరాలో ముంచి రాస్తా!

— త్రిపురనేని శ్రీనివాస్